క్లుప్తంగా

బార్ అసోసియేషన్ ఎన్నికకు నోటిఫికేషన్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదలయింది. ఈ నెల 20వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. 22 వరకు విత్‌డ్రాకు అవకాశం, 28వ తేదీన పోలింగ్ జరగనుంది. అదేరోజు ఓట్ల లెక్కింపు పూర్తయితే నూతన కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

నేడు సర్వసభ్య సమావేశం

కేతేపల్లి: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నామని కేతేపల్లి ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రైతులకు శిక్షణ



రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు రైతులకు శిక్షణ ఇచ్చారు. వరి పంటలో వచ్చే చీడపీడలు, వాటి నివారణపై గిరి ప్రసాద్, సుమన్ రామన్ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గిరిప్రసాద్, విస్తరణ అధికారి లియాకత్ అలీ, రైతులు కిషన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కోటేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

శివలీలకు ఉత్తమ మహిళ అవార్డు



కనగల్: మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త కంబాల శివలీలరెడ్డికి ఉత్తమ మహిళ అవార్డు లభించింది. శివలీలరెడ్డి తన ఫౌండేషన్ ద్వారా చేసిన సేవలకు ఇప్పటికే పలు అవార్డులు అందుకున్నారు. ఉమెన్స్ డే సందర్భంగా మదర్‌థెరిస్సా అవార్డు అందుకున్నారు. ఈ నెల 17న విస్డమ్ చారిటబుల్ ట్రస్ట్ వారు ఉమెన్స్ డే సందర్భంగా హనుమకొండలో ఉత్తమ మహిళ అవార్డు తనకు అందజేయనున్నట్లు శివలీల శుక్రవారం తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల నియామకం



శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామానికి చెందిన రాందాస్ శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ మర్రిగూడ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. శుక్రవారం చింతపల్లి మండలంలోని కురుమేడు గ్రామంలోగల ఓ ఫంక్షన్ హాల్‌లో రాందాస్ శ్రీనివాస్‌కు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియామకపత్రం అందచేశారు. కార్యక్రమంలో వెన్నమనేని రవీందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, వెంకటంపేట బాలయ్య, కంచుకట్ల సంపత్, మెండు దీపికరెడ్డి, ఏర్పుల శ్రీశైలం, కల్లెం జైపాల్‌రెడ్డి, నక్క తిరుపతయ్య, జమ్ముల వెంకటేష్‌గౌడ్, రావుల రాములుగౌడ్, మాతంగి నవీన్, మేతరి శంకర్, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, సిరిపంగి శ్రీనివాస్, వనపర్తి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి అధ్యక్షుడిగా కత్తి రవీందర్‌రెడ్డి



నాంపల్లి : కాంగ్రెస్ పార్టీ నాంపల్లి మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కత్తి రవీందర్‌రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం మాల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో రవీందర్‌రెడ్డికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు.

అనుముల శ్రీనివాస్‌కు కీర్తి పురస్కారం



చిట్యాల: గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు తోడ్పాడు అందిస్తున్నందుకు చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్‌కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం-2022 కు ఎంపిక చేస్తున్నట్లు శుక్రవారం యూనివర్సిటీ అధికారులు ప్రకటించారు. ఈ నెల 21వ తేదీన హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ కీర్తి పురస్కారాన్ని శ్రీనివాస్‌కు అందజేయనున్నారు. అనుముల శ్రీనివాస్ తన స్వగ్రామం గుండ్రాంపల్లిలో 2006లో ఆ గ్రామ యువకులతో కలిసి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ పలు గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి వేలాది పుస్తకాలను అందజేశారు.

కల్వర్టు నిర్మాణ పనులకు మోక్షం

- గట్టుప్పల్-ధర్మ తండా మధ్యలో నిర్మాణం
- వారం రోజుల్లో పనులు ప్రారంభం
- ఆనందం వ్యక్తం చేస్తున్న తండావాసులు



గట్టుప్పల్ మండల కేంద్రం నుంచి ధర్మతండాకు వెళ్లే దారిలో కల్వర్టు నిర్మించనున్న ప్రదేశం

చండూరు(గట్టుప్పల్) : ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న గట్టుప్పల్ మండలంలోని ధర్మాతండా వాసులకు కల్వర్టు నిర్మాణంలో తిప్పలు తప్పనున్నాయి. గట్టుప్పల్-ధర్మ తండా మధ్యలో కల్వర్టు లేకపోవడంతో ఇన్నాళ్లు తండావాసులు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. కల్వర్టు నిర్మాణం పూర్తయితే తండావాసులు మండల కేంద్రానికి రావడానికి సులువుగా ఉంటుంది.

గత సంవత్సరం సెప్టెంబర్‌లో శంకుస్థాపన

గట్టుప్పల్ మండల కేంద్రం నుంచి ధర్మతండా మధ్యలో కల్వర్టు నిర్మాణ పనులకు గత ఏడాది రూ.34.20 లక్షలు మంజూరయ్యాయి. ఆ సంవత్సరం సెప్టెంబర్ నెలలో పనులకు శంకుస్థాపన చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పనులు ప్రారంభం కావడంలో ఆలస్యం జరిగింది. గతంలో ఓ కంట్రాక్టర్ పనులు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే నూతన ప్రభుత్వం రావడంతో కంట్రాక్టర్ మారి పనుల్లో జాప్యం పెరిగింది. ప్రస్తుతం వారంలోగా పనులను ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్వర్టుతోపాటు ఇరువైపులా మట్టి పోయనున్నారు. పనులు వేగంగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వర్షాకాలంలో తండావాసుల తిప్పలు

గట్టుప్పల్ మండల కేంద్రం నుంచి ధర్మతండాకు సుమారుగా 1.5 కిలో మీటర్ దూరం ఉంటుంది. తండావాసులు తమ అవసరాలకు ఏదైనా వస్తువు కొనుగోలు చేయాలంటే గట్టుప్పల మండల కేంద్రానికి రావాల్సిందే. అయితే మధ్యలో పెద్ద కల్వర్టు ఉంది. చిన్న వర్షాలకు సైతం వరద నీరు కల్వర్టు పై నుంచి పొంగి పొర్లుతుంది. దీంతో వర్షాకాలంలో తండా వాసులు రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు భారీగా కురిస్తే గట్టుప్పల మండల కేంద్రానికి ధర్మతండాకు రాకపోకలు బంద్ అవుతుంటాయి. ఇక కల్వర్టు నిర్మాణం పూర్తయితే తండా వాసులకు రాకపోకలకు ఇబ్బందులు తప్పనున్నాయి. కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయని తెలియడంతో తండా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

వర్షం వస్తే ఇబ్బందులు పడుతున్నాం



మండల కేంద్రం నుంచి మా తండాకు వెళ్లే దారిలో కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా ఉంది. వర్షాలు వస్తే తండాకు వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చొరవతో పనులు ప్రారంభం కావడం గొప్ప విషయం. పనులు త్వరగా పూర్తి చేసి మా ఇబ్బందులు తొలగించాలి.

-ధర్మానాయక్, ధర్మాతండా

వారంలోగా పనులు ప్రారంభిస్తాం

గట్టుప్పల్ మండల కేంద్రం నుంచి ధర్మతండా మధ్యలో కల్వర్టు నిర్మాణ పనులు వారంలో మొదలు కానున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పనులు ప్రారంభించడంలో ఆలస్యం జరిగింది. కల్వర్టు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

-రమేష్ , పీఆర్ ఏఈ

అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు చేశాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

నకిరేకల్ : నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి జరిగేలా ప్రణాళికలు చేశామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించడంతో నకిరేకల్‌లోని వైశ్య భవన్‌లో ఆర్యవైశ్య మండల, పట్టణ, మహిళా విభాగాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీరేశం పాల్గొని మాట్లాడుతూ తన లక్ష్యం, తపన నియోజకవర్గ అభివృద్ధే అన్నారు. త్వరలోనే నకిరేకల్‌లో 100 పడకల వైద్యశాల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని తీసుకురాబోతున్నామని తెలిపారు. సీఎం ఇక్కడకు వచ్చాకా నకిరేకల్ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేస్తారని, ఆ నిధులతో నకిరేకల్ రూపురేఖలు పూర్తిగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. నియోజకవర్గ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. నకిరేకల్ పట్టణం చుట్టూ రింగ్ రోడ్డుతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలను ఒకే సముదాయంలో నిర్మించబోతున్నామన్నారు. నూతనంగా నిర్మించిన 100 పడకల ఆస్పత్రికి గాంధీ ఆస్పత్రిగా నామకరణం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, మండల, పట్టణ అధ్యక్షులు బ్రహ్మదేవర రాంమోహన్‌రావు, వీర్లపాటి నర్సింహారావు, యువజన విభాగం అధ్యక్షుడు బెలిదే శ్రీను, మహిళా విభాగం అధ్యక్షులు సోమ కృష్ణవేణి, బ్రహ్మదేవర పద్మావతి, సోమ గీతా, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, సోమ యాదగిరి, బ్రహ్మదేవర రమేష్, వీరవెల్లి రఘునాథ్, బోనగిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

నకిరేకల్ : విద్యార్థులు తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని ప్రముఖ కవి,గాయకుడు శ్రీ వశిష్ఠ విద్యాసంస్థల అసోసియేట్ డీన్ కొంపెల్లి దశరథ అన్నారు. నకిరేకల్‌లోని న్యూవిజన్ స్కూల్‌లో శుక్రవారం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి వెళితే సత్ఫలితాలు పొందుతారని అన్నారు. డీన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, కరస్పాండెంట్ లింగయ్య, ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలో పశులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లి, మల్లెపల్లివారిగూడెం గ్రామాల్లో మండల వెటర్నరీ సిబ్బంది టీకాలు చేశారు. జిల్లా అధికారులు డాక్టర్ ఎం.వి.సుబ్బారావు, డాక్టర్ ఆర్.కె.రెడ్డి టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు.

విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ



గట్టుప్పల్ : అంతంపేట పాఠశాలలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందిస్తున్న సుధాకర్



నాంపల్లి : విద్యార్థినికి పరీక్ష ప్యాడ్ అందజేస్తున్న ఎస్ఐ లచ్చిరెడ్డి

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్లలో ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే 60 మంది విద్యార్థులకు శుక్రవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గుండు వెంకటేశం, తిరుమలరాము, ముక్కమల్ల శేఖర్, బల్లెంల ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు, పెన్నుల అందజేత

గట్టుప్పల్ (చండూరు): గట్టుప్పల్ మండలం అంతంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఎస్ఎన్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ బానావత్ సుధాకర్ శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన మెటీరియల్, ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఐదువేల బహుమతి అందజేస్తానన్నారు. కార్యక్రమంలో గూడపు జలంధర్, అయితగోని భుజంగంగౌడ్, ఆంగోతు మంగ్తా నాయక్ పాల్గొన్నారు.

నాంపల్లి మండల కేంద్రంలో..

నాంపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను ఎస్ఐ లచ్చిరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ లచ్చిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సంఘం నాయకులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, సందీప్, ఉపాధ్యాయులు దామోదర్‌చారి, నారాయణ తదితరులు ఉన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు..

కేతేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు చేయూతనందించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ముందుకు రావాలని ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి కోరారు. మండలంలోని కేజీబీవీ పదో తరగతి విద్యార్థినులకు శ్రీసాయికృష్ణ ఎడ్యుకేషనల్ ఆధ్వర్యంలో సమకూర్చిన పరీక్ష ప్యాడ్లు, ఇతర మెటీరియల్‌ను శుక్రవారం వారు పంపిణీ చేసి మాట్లాడారు. దాతలు అందించిన సహకారాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని పరీక్షలు చక్కగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ జి.సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సీబీ ప్రసాద్, తహసీల్దారు ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, సొసైటీ ఫౌండర్ శివ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, బీరం జాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో ఆరోగ్య కేంద్రాన్ని పూర్తి చేస్తాం

- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ : అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి



సమీకృత భవన సముదాయానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండటౌన్: నల్లగొండలోని మాన్యంచెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాన్యంచెల్కలో రూ.కోటి 43 లక్షల నిధులతో నిర్మించనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేసి మాట్లాడారు. అన్ని రకాల జబ్బులకు చికిత్స అందించేవిధంగా ఈ హెల్త్ సెంటర్‌ను తీర్చిదిద్దుతామన్నారు. మాన్యంచెల్క ప్రాంత ప్రజలు ఉన్నచోటే చికిత్స పొందేందుకు పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈ ఆస్పత్రిని అన్ని హంగులతో నిర్మించేందుకు అవసరమైతే తన నిధుల నుంచి రూ.50 లక్షలు ఇస్తానని అన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని దత్తత తీసుకొని మరిన్ని సేవలు అందించేలా చూస్తామన్నారు. అనంతరం మంత్రి నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్‌లో రూ.11 కోట్ల 20 లక్షల నిధులతో నిర్మించనున్న ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, ఆర్డీఓ రవికుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కౌన్సిలర్లు కర్నాటి కరుణాకర్‌రెడ్డి, మాతంగి సత్యనారాయణ , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త రీసైక్లింగ్‌తో అదనపు ఆదాయం

నల్లగొండ: చెత్తను వేరు చేసి రీసైక్లింగ్ చేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో నల్లగొండ మున్సిపాలిటీ, డబ్ల్యూఓ డబ్ల్యూటీసీల సంయుక్త ఆధ్వర్యంలో చెత్తను వేరు చేయడం, చెత్త ద్వారా ఆదాయం ఆర్జించే పద్ధతులపై జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. అనంతరం చెత్తను వేరు చేయడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించే వాల్ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఇలాంటి కార్యక్రమాన్ని నల్లగొండ మున్సిపాలిటీలో ప్రారంభిస్తున్నందుకు ఐటీసీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ చెత్తను సేకరించడం, రీసైక్లింగ్ చేయడంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగరం దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. నల్లగొండ కూడా దేశంలో నంబర్ వన్ స్థానం పొందేలా ప్రతిఒక్కరూ అవగాహన చేసుకుని కష్టపడాలన్నారు. అనంతరం చెత్తను వేరు చేయడం వల్ల కలిగే ఉపయోగాలపై మున్సిపల్ కార్మికులకు, రిసోర్స్ పర్సన్‌లకు ఐటీసీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, ఆర్డీఓ రవి, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, ఐటీసీ ప్రతినిధి ఉమాకాంత్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం



పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న వెలిమినేడు రెడ్డి సంఘం ప్రతినిధులు

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వెలిమినేడు గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు రెడ్డి సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుతో ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి కులస్తులకు భరోసా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం ప్రతినిధులు గడ్డం దశరథరెడ్డి, సత్తిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, బలరాంరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నవదీప్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా యాదవ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల చిట్యాల మున్సిపాలిటీకి చెందిన యాదవ సంఘం నాయకుడు కోసనం అశోక్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.

కనులపండువగా ఆలయ బ్రహ్మోత్సవాలు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళా భక్తులు

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో గల శ్రీపార్వతి శంభులింగేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారానికి 8వ రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చన, ఆంజనేయ స్వామి ప్రభల ఊరేగింపు కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు.

ఘనంగా ఆంజనేయస్వామి ప్రభల ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీపార్వతి శంభులింగేశ్వర ఆలయం, శ్రీఆంజనేయస్వామి ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ప్రభల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులతోపాటూ చుట్టుపక్కల గ్రామాల భక్తులు తమ ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లను అందంగా అలంకరించుకొని ఆంజనేయస్వామి ప్రభలతో గ్రామంలోని ప్రధాన వీధులగుండా, ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ నెల 8న ప్రారంభమైన ఆలయ బ్రహ్మోత్సవాలు 16న ముగియనున్నాయి.

ప్రచార పోస్టర్ల విడుదల

నకిరేకల్ : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మామిడోజు వెంకటేశ్వర్లు కోరారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఈ నెల 15 నుంచి 30 వరకు గ్రామగ్రామాన నిర్వహించే వేడుకలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను శుక్రవారం ఆయన నకిరేకల్‌లో విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పవన్, బండారు వెంకన్న, పిట్టల అనిల్, సురేష్, రాజు, శంకర్, ప్రదీప్, ఏసు, నాగరాజు, అనిల్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: నల్లగొండలోని అంబేద్కర్ భవన్‌లో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న మాదిగ ఉపకులాల సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి మంద వెంకన్నమాదిగ కోరారు. చిట్యాలలో శుక్రవారం ఆ సంఘం నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడు పోలెపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మాదిగ ఉపకులాల సదస్సు ప్రచార పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా మాదిగ ఉపకులాల హక్కుల కోసం ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో మీసాల శ్రీకాంత్, జిట్ట స్వామి మాదిగ, చింత సురేష్‌మాదిగ, పులిగిల్ల దిలీప్‌మాదిగ, మీసాల అశోక్ మాదిగ, బరాల వెంకన్న మాదిగ, నాగిళ్ల ప్రకాష్ మాదిగ పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. అనంతరం విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని శాలువాలతో సన్మానించి షీల్డ్‌లు, మెమొంటోలు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు అంబటి అంజయ్య , ఉపాధ్యాయులు రంగరాజు జ్యోతి, పద్మజ, సునంద, మేరీ సుజాత, నీరజ, కె బాలరాజు, లోహిత్, రాజేందర్, చంద్రయ్య, యాదగిరి, నర్సింహారెడ్డి, అబ్దుల్‌గఫూర్, సీఆర్‌పీలు రవికుమార్, లింగయ్య పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన

కట్టంగూర్ : మండల కేంద్రంలో ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలను శుక్రవారం ఎంఈఓ మేక నాగయ్య పరిశీలించారు. కట్టంగూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 140 మంది, సాందీపని స్కూల్‌లో 180 మంది, గీతాంజలి యూపీఎస్‌లో 120 మంది చొప్పున మొత్తం 440 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాన్ని ఆదేశించారు. ఆయన వెంట సీఆర్‌పీలు గోవర్ధన్, పోలగోని రవికుమార్, రామలింగయ్య ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆశా కార్యకర్తల వినతి

నాంపల్లి : లెప్రసీ సర్వేకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆక్రాత్‌కు తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి పాల్గొని మాట్లాడుతూ రెండేళ్లుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు ఆశా కార్యకర్తలు సర్వే నిర్వహించబోరని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి మెగావత్ సునీత, సీహెచ్ సైదమ్మ, రేణుక, విజయ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

మర్రిగూడ: వట్టిపల్లి పరిధిలోని బట్లపల్లిలోగల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ అర్చకుడు లోక వెంకటశర్మ తెలిపారు. శనివారం స్వామివారి కల్యాణం, ఆదివారం రథోత్సవం, సోమవారం దోపోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

స్వగ్రామంలో మంత్రి సందడి



బి.వెల్లంల గ్రామంలో సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



వృద్ధుడితో మాట్లాడుతున్న మంత్రి



బి. వెల్లంల గ్రామంలో మహిళతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి



బి. వెల్లంల గ్రామంలో జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

చిరుధాన్యాల్లో పోషకాలు అధికం

మర్రిగూడ: చిరుధాన్యాల్లో పోషకాలు అధికంగా లభిస్తాయని చింతపల్లి సీడీపీఓ లావణ్యకుమారి అన్నారు. శుక్రవారం మర్రిగూడ మండలంలోని యరగండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించి చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద, పంచాయతీ కార్యదర్శి పద్మ, అంగన్‌వాడీ టీచర్లు రజిత, మమత, సత్తెమ్మ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే ఉద్యోగులకు గుర్తింపు

కేతేపల్లి: విధి నిర్వహణపట్ల అంకితభావంతో పని చేసే ఉద్యోగులకు తప్పక గుర్తింపు లభిస్తుందని కేతేపల్లి ఎంఈఓ నాగయ్య అన్నారు. కేతేపల్లి, కొత్తపేట జెడ్పీ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తూ పదవీ విరమణ పొందుతున్న పసుపులేటి లీల, జాల శంకర్‌రెడ్డి వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు వై.నర్సిరెడ్డి, వి.రాధాకృష్ణమాచార్యులు, ఉపాధ్యాయులు కె.బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

నల్లగొండ: కాన్షీరామ్ జయంతి సందర్భంగా శుక్రవారం నల్లగొండలో ఆయన చిత్రపటానికి ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ కాన్షీరామ్ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీను, జగన్, వెంకన్న, శంకర్, ఎల్లయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.